# వరవిక్రయం

కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

రిజిస్టర్ లెటర్ వచ్చింది. సంతకం చేసి కవరు తెరిచాను. విషయం సరిగా చదివానో లేదో ఎదురుగా వాలు కుర్చీలో పడుకుని పేపరు చదువుతున్న నాన్న అడిగాడు - "ఏమిట్రా అది?"

నేను క్షణం మాట్లాడలేదు.

"యూనివర్సిటీ నుంచేనా?" రెట్టించినట్టు మళ్ళీ అడిగాడు.

"అవును" అని ముక్తసరిగా సమాధానం చెప్పాను.

"ఈ సారీ గంట కొట్టిందా?" ఆక్రోశమంత ఆయన మాటల్లో పెల్లుబికింది.


నేను ఏమీ సమాధానం చెప్పకుండా అక్కడనుంచి కదిలాను.

"అవును. పోకేం జేస్తుందీ? శ్రద్ధ ఉంటేగా? వేలు వేలు పోసి మేము చదివించటం, మీరు ఏళ్ళు ఏళ్ళు తప్పుతూ కూర్చోవటం. ఏం చేస్తాం? అంత కర్మ! యాభైవేలు డొనేషనుకు పోశాను. నేనేమీ లంచాలు తీసుకుని సంపాయించిన సొమ్ము కాదు పోనీలే పోతే పోయింది అనుకునేందుకు. కష్టార్జితం. పోయిన సొమ్మును రాబట్టుకునేందుకు పోనీ లంచాలు పడదా మంటే మా డిపార్టుమెంటు అలాంటిది కాదు తగులడి! ఏం చేస్తాం? ఋణగ్రస్తం. ఏనాడు మీకు ఋణపడ్డామో ఈ విధంగా తీర్చుకుంటున్నాం. గత జన్మలో శత్రువులు పగ తీరక ఈ జన్మలో పుత్రులై జన్మిస్తారట. నిజమేనేమో!" అంటూ చాలా చాలా అంటున్నారు. పక్క గదిలో ఉన్న నా చెవిన పద్దన్నా ఆ మాటలు పడుతున్నాయి. గుండుసూదుల్లా గుచ్చుకుంటున్నాయి.

నాన్నగారి హంగామా చూసి వంటింట్లో చేస్తున్న పని మాని "ఏమిటండీ! ఎవరి మీద విరుచుకు పడుతున్నారూ?" దీర్ఘాలు తీస్తూ అక్కడకు వచ్చింది అమ్మ.

"ఎవరి నంటాం? మీ సుపుత్రుగ్గి నిర్వాకం. ఈ సారీ తప్పాడు. అయినా వాడిని అని ఏం ప్రయోజనం? వద్దు మొర్రో అంటున్నా వినకుండా చెవిలో ఇల్లు కట్టుకుని పోరావు. డొనేషన్ కట్టించావు. ఇప్పటికి వాడు రెండు సంవత్సరాలుగా తప్పుతున్నాడు. ఇలా ఎన్ని దండయాత్రలు చేస్తాడో భగవంతుడికి ఎరుక. పిల్లల్ని కనగానే సరికాదు. సక్రమంగా పెంచటం రావాలి" నాన్న ఫుల్‌స్టాప్ పెట్టకుండా అంటూనే ఉన్నాడు.

కానీ అక్కడే అమ్మకు అసలైన పాయింటు దొరికింది. "నేను ఒక్కదాన్నే కన్నానా?" మీకూ అందులో భాగం ఉంది అని దాని భావార్థం. "లోకంలో ఎంతమంది కనలేదూ?" కనటం చాలా సహజమైన విషయం అని నాన్నకు ఎరుకపరచటం. "మీరు మాత్రం తక్కువ తిన్నారా?" దీని భావం చెప్పటం చాలా కష్టం. ఇలా అమ్మ రెండర్థాలు వచ్చేట్టు విసుర్లు విసురుతోంది. ఇక వాళ్ళ సంభాషణ రావణాసురుని కాష్ఠంలా కాలుతూనే ఉంటుంది. చీమూ? నెత్తురూ ఉన్నవాడు అక్కడ నిలవలేడు. అందుకే బయటకు వచ్చేశాను.



అమ్మా, నాన్నలను ఎలానో తప్పించుకుని రాగలిగాను. కానీ వసంతకు ఎలా నచ్చచెప్పటం? ఈ అవమానం తనదే అన్నట్టు భావిస్తుంది. నలుగురిలో తలకొట్టేసినట్టు అయిం దంటూ సాధిస్తుంది. క్రితం సారి తప్పినప్పుడు వసంత అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"మీ అమ్మా, నాన్న తెగ పొగిడితే మీరు మహా తెలివిగలవారని మురిసిపోయాను. మా ఆయన ఇంజనీరు అని ఏకంగా అందరికీ చెప్పాను కూడా. రేపో, ఎల్లుండో జీపులో వస్తారని అందరూ అనుకున్నారు. కానీ మీరు మాత్రం పంక్చర్ అయిన ట్యూబ్‌లా తెల్లముఖం వేసి దండయాత్ర చేశారు. అయినా మాదే బుద్ధి తక్కువ. మీరు ఇంజనీరు చదువుతున్నారని మీ అమ్మా వాళ్ళు, చెప్పినప్పుడే మెరిట్లోనా, డొనేషను కట్టా అని అడిగి

ఉండాల్సింది. ఏదీ! మాకు అంత తెలివి లేందే! అక్కడికీ అందరూ అన్నారు కూడా నిక్షేపంలా ఉద్యోగం చేసేవాణ్ణి చేసుకోమని. కానీ నా కంటికి కామెర్లు కమ్మాయి. అందంగా కనపడేప్పటికి ఎగిరి గంతేశాను. వెనుకా ముందూ ఆలోచించకుండా పై పై మెరుగులకు పోతే ఇలానే ఉంటుంది."

ఆనాడు పుట్టింటికి వెళ్ళిన వసంత మళ్ళీ అత్తింటి గడప తొక్కలేదు. ఒకసారి నాన్న కేకలేస్తే అభిమానం చంపుకుని అక్కడకు తనే వెళ్ళాడు. పైకి ఎంతో మర్యాద చేస్తున్నట్లే కనపడిన అత్తగారు, తీరా "అమ్మాయిని వెంట పంపండి" అని అడిగితే "నా దేముంది నాయనా? మీరూ మీరూ చూసుకోవాల్సిన విషయం. చిన్న వాళ్ళేం కాదు. ఈ రకంగానైనా నీలో పట్టుదల పెరిగి చదువుతా వని దాని భ్రమ. దాని పిచ్చిగాని ముక్కీ, మూలిగీ పాస్ అయితే మాత్రం ఎవరిని ఉద్ధరిస్తారు? ఫస్ట్ క్లాస్ వచ్చిన వాళ్ళకే దిక్కు లేదు. అంతా మా తలరాత. వేలకు వేలు కట్నాలు పోసి అల్లుళ్ళను తెచ్చుకోవటమూ, వాళ్ళు ఇంట్లో కుండలు తంతూ కూర్చోవటమూ. ని న్నని కాదు. ఏదో లోకసహజమైన మాట అంటున్నాను. ఏమీ అనుకోకు నాయనా!" అంటూ మెత్త మెత్తగా అంది.

నేను నడుస్తూ ఆలోచిస్తున్నాను. చిత్రం కాకపోతే మ రేమిటి? నేను ఎంత వద్దని మొత్తుకుంటున్నా నన్ను ఇంజనీరింగ్‌లో పారేశారు. నాకు ఆ చదువు ఒంటబట్టదు అని శత విధాల నచ్చ చెప్పాను. నాన్న వింటేనా? "వెధవ డిగ్రీ చదివి ఏం వెలగబెడతావు? కాణీకి పనికి రావు" అన్నాడు. ఆయన అన్న మాటా ఒక విధంగా నిజమే! నేను ఇంజనీరింగ్‌లో చేరబట్టే సంబంధాలు తెగ వచ్చాయి. చదువు పూర్తి కానిదే పెళ్ళి వద్దంటున్నా వినకుండా వసంతతో సంబంధం ఖాయపరిచారు. అదేమిటంటే "అక్క పెళ్ళి కావద్దూ?" అన్నారు. పోనీ ఈ విధంగానైనా అక్క ఒక ఇంటిది అవుతుం దని కదా అని ఒప్పుకున్నాను.

అక్క పెళ్ళి ఘనంగా చేశారు. ఇంకా డబ్బు మిగిలింది. దాన్ని నాన్న బ్యాంకులో తన పేర వేసుకున్నాడు. అది వేరే విషయం. అందుకు నేను బాధపడటంలేదు.

నా బాధల్లా ఒక్కటే. నన్ను ఇంజనీరింగ్‌లో చేర్పించి నాన్న బాగా కట్నం సంపాయించాలని అనుకున్నాడు. అందుకు నేను అడ్డు చెప్పలేదు. పైగా ఒక విధంగా సహకరించాను. కానీ ఇష్టం లేని చదువులో నన్ను చేర్పించి, అందులో తప్పినందుకు నన్ను ఓ అయోగ్యుణ్ణి చూసినట్టు ఎందుకు చూస్తారా అని.

ఎందుకో ఎంతకీ ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. అమ్మా, నాన్నల మొహం చూడ మనస్కరించలేదు. పోనీ వసంత దగ్గరకు వెళ్ళి కాస్తంత సేద తీర్చుకుందామా అంటే అది ఓ రౌరవ నరకం. కటువుగా మాట్లాడే వాళ్ళ నైనా భరించగల మేమో కాని, కల్మషంతో మాలాడే వాళ్ళను అసలు భరించలేము.

పరీక్ష తప్పినంత మాత్రాన మనిషి ఇక ఎందుకూ పనికిరాడా? చదువుకున్న వాళ్ళే జీవితంలో అన్నీ సాధిస్తారా? ఏవేవో పిచ్చి ఆలోచనలు వచ్చాయి. ఎంతకీ ముడి పడవు.

కానీ ఒక్కటి మాత్రం స్థిరం చేసుకున్నాను. అందరూ నన్ను పనికిరానివాడుగా, ఒట్టి అయోగ్యుడుగా చూశారు. కానీ వారి అంచనాలు తారుమారు చేయాలి! అలా అని వారు కట్టేసిన కట్టుకొయ్యను అంటిపెట్టుకుని ఇంజనీరింగు చదవాలని లేదు. కానీ ఏదో సాధించాలని ఉంది. అందుకే ఇంట్లోంచి వెళ్ళిపోయాను. అష్టకష్టాలు పడి ఐ.ఏ.ఎస్. పాస్ అయ్యాను.

వార్త అందగానే అత్తగారు ఇంటిముందు వాలారు - "నాయనా! ఇప్పుడు నువ్వు కాదంటే ఎలా? నిన్నే నమ్ముకుని అమ్మాయి నిద్రాహారాలు మానేసింది. దానికి నీ మీద ఏమైనా పగా? ఏదో పట్టుదలతో నువ్వు చదివి పైకి వస్తా వనే ఆశే తప్ప. తన భర్త వృద్ధిలోకి రావాలని ఏ ఆడది కోరుకోదూ? ఏదో చిన్నపిల్ల. అప్పు డన్న మాటలు పట్టుకుని సాధించటం భావ్యం కాదు. నువ్వు కాదూ అంటే అది ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటుంది. మాకు అంత శోకం కలిగించకు" అంటూ అత్తగారు కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

నేను వింటూ కూర్చున్నాను. మొదట తను అన్న మాటలకూ, ఇప్పటికీ ఎంత వ్యత్యాసం ఉందా అని బేరీజు వేసుకుంటున్నాను. అమ్మ ఆమెకు వత్తాసు పలికింది.

"ఇలాంటి పనులు మన ఇంటా వంటా లేవు. కట్టుకున్న దాన్ని కాదూ అంటే మన పరువు బజారున పడదూ? అభం శుభం తెలియని పిల్ల ఏదో అలిగి వెళ్ళిపోయినంత మాత్రాన మళ్ళీ ఏలుకో నంటావా? ఎంత తప్పు! ఇదే పని మీ అక్కయ్య చేస్తే మనం ఏం చేసి ఉండేవాళ్ళం? కష్టం మనకు వస్తే ఒకటి, వేరే వాళ్ళకు వస్తే మరొకటీనా? అందరి ముందూ పల్చన చెయ్యకు. మీ అత్తగారు ఇంతగా భంగపడి అడగటం బాగుండలేదు. నువ్వు వెళ్ళి వసంతను వెంటబెట్టుకు రా! నువ్వు రాకపోతే ఆమెకు మొహం చెల్లటం లేదట!"

ఇక మిగిలింది నాన్నే! ఆయన ఏమంటారో తెలును. ఎంతో దర్పంగా, గంభీరంగా ఉపన్యాసం ఇస్తాడు.

"పదవిలో ఉండగా పట్టుదలకు పోకూడదు. సర్దుకుపోవాలి. పట్టుదలకుపోయిన వాళ్ళు ఎందుకూ పనికిరాని సీటులో పడి అఘోరిస్తున్నారు. వాళ్ళ జీవితం క్లర్క్ కంటే హీనంగా ఉంటుంది. అదే సామరస్యంగా పోతే తను తినగా పదిమందికి పెట్టచ్చు. అందరిలోనూ మంచివాడి వనే పేరూ సంపాదించవచ్చు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి." ఇలా ఎన్నెన్నో నీతి వాక్యాలు చతురతతో వల్లె వేశారు.

నా సందిగ్ధం ఒక్కటే! లోకానికి తల వంచి సర్దుకుపోతూ ఉంటే లోకానికి తగిన గుణపాఠం ఎవరు నేర్పుతారూ? అని. పోనీ అదే పని నేను చేస్తే 'కక్ష సాధించాడు. నీచుడు' అంటారు కదా అని.

అన్నీ మరిచిపోయి కని, పెంచిన తల్లిదండ్రులే కదా అని దగ్గరికి చేరదీయవచ్చు. అప్పుడు లోకంలో నాకు 'కృతఘ్నుడు' అనే చెడ్డపేరు రాదు. తల్లిదండ్రుల ఋణం తీర్చుకున్నాడు అని పట్టం కడతారు. కానీ నాలా అందరూ అనుకుంటే తల్లిదండ్రులు పిల్లలతో చేసే వ్యాపారం ఇలా సాగుతూనే ఉంటుంది కదా!

ఇక వసంత విషయానికి వస్తే 'నడ పీనుగు వచ్చు నను చు' నవ్విన ఆడదానితో అన్నీ మరిచిపోయి కాపురం చేయటం ఎలా? క్షణం క్షణం ముల్లులా నా మనసులో కలుక్కుమనదా? ఆమె అన్న మాటలు మరిచిపోయి, లజ్జారహితంగా ఆమెతో కాపురం చేయటం ఎలా?

అందుకే అంటున్నాను 'లోకం చాలా చిత్రమైంది' అని. ఈ కథకు ముగింపు ఇవ్వటమంటే ఒక ప్రాణిని శారీరకంగా, మానసికంగానో చంపటం. అందుకే ఇలాంటి కథలు లోకంలో పుట్టకూడ దంటాను. ★

